క్లుప్తంగా

అలుగు నీటి సమస్య పరిష్కరించడంలో విఫలం

చింతల్: దూలపల్లి తుమార్ చెరువు అలుగు నీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని వైఎస్సార్‌టీపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. దూలపల్లి తుమార్ చెరువు అలుగు నీరు బయటకి పోవడానికి సరైన నాలా లేకపోవడంతో చెరువు కింద ఉన్న ఖాళీ స్థలం మీదుగా జనావాసాల మధ్య ప్రవహిస్తూనుండడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇళ్ల మధ్య నుంచే నీరు ప్రవహిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

యోగా స్టూడియోలో జన్మాష్టమి వేడుకలు



కుత్బుల్లాపూర్: సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లో ఉన్న శివశక్తి ధ్యాన యోగా స్టూడియోలో గురువారం రాత్రి శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా వేడుకలు భక్తి పారవశ్యంతో జరిగాయి. అర్ధరాత్రి వరకు దాండియా, భక్తి గీతాలు, శ్రీకృష్ణుడిని తొట్టెలలో వేసి భక్తి గీతాలు ఆలపించారు. ఫౌండర్, యోగా గురువు మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాస్టర్ పూర్ణ, సాధక బృందం, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎంఎస్ వాసు, సుశాంత్ గౌడ్, జగద్గిరిగుట్ట కన్యకాపరమేశ్వరి టెంపుల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



శానిటేషన్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్

నిజాంపేట్: వర్షాకాలం అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని మేయర్ కొలను నీలారెడ్డి అన్నారు. శుక్రవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాయలంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో నీలారెడ్డి మాట్లాడుతూ.. శానిటేషన్ అధికారులు సిబ్బంది ఆయా డివిజన్‌లలోని చెత్త తొలగింపు, నాలాలపై మూతలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గుదల, నిషేధం, బస్తీ, కాలనీల రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణారావు, శానిటేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగంగౌడ్‌కు నివాళి

చింతల్: కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ లింగంగౌడ్ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ తనయుడు, రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ కుత్బుల్లాపూర్ చౌరస్తాలోని లింగంగౌడ్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం లింగంగౌడ్ ఘాట్, శ్రీరామ్ నగర్, విజయ్‌నగర్ కాలనీలలో ఉన్న లింగంగౌడ్ విగ్రహాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగంగౌడ్ అభిమానులు, సీనియర్ నాయకులు, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్‌లోని నల్లపోచమ్మ ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చండీ హోమం నిర్వహించి అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు.ఎమ్మెల్యే వివేకానంద్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కె.ఎం.ప్రతాప్‌లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలరాజ్ కురుమ, ప్రధాన కార్యదర్శి గరిగె రమేష్ ముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు దేవేందర్, సుధాకర్, వెంకటేష్, రవి యాదవ్, సంపత్, గుండాల నరసింహ, వాసంశెట్టి దుర్గాప్రసాద్, మోతె శ్రీనివాస్‌యాదవ్, మామిడాల రవీందర్ రెడ్డి, పరిష వేణు, శ్రీకాంత్, క్రేన్ రవి కుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



కేఎం ప్రతాప్‌ను సత్కరిస్తున్న నల్లపోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు

వీధి వ్యాపారులకు అండగా.. ప్రధాని ఆత్మ నిర్భర్

- కరోనా తర్వాత వీధివ్యాపారులను ఆదుకునేందుకు ప్రత్యేక పథకం
- ఇప్పటి వరకు మూడు విడతలుగా లబ్ధిపొందుతున్న వ్యాపారులు
- మొత్తం మూడు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో రూ.8.18 కోట్లు జమ

దుండిగల్: వీధి వ్యాపారులను ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ×ప్రధాని ఆత్మ నిర్భర్×పథకం వారికి కొండంత అండగా నిలుస్తోంది. కరోనా మహమ్మారి విజృంభించిన అనంతరం వారి జీవితాలు అతలాకుతలమైన విషయం తెలిసిందే. వీధి వ్యాపారులను ఆదుకునేందుకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ప్రధాని ఆత్మ నిర్భర్'పథకాన్ని ప్రవేశపెట్టారు. వీధి వ్యాపారులను గుర్తించడంతో పాటు వారికి ఆర్థిక సాయం అందించడంలో మొదట్లో కొన్ని ఆటుపోట్లు ఎదురయ్యాయి.

అయినప్పటికీ మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) అధికారులు, మున్సిపల్ అధికారులు వాటిని అధిగమిస్తూ ఇప్పటి వరకు మూడు విడతల్లో వీధి వ్యాపారులకు రుణాలను అందజేసి లబ్ధిదారులకు చేయూతనిస్తున్నారు. నియోజకవర్గంలోని నిజాంపేట కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల్లో ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.8.18 కోట్లు జమయ్యాయి.

మొదట్లో 6,007 మంది గుర్తింపు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిజాంపేట కార్పొరేషన్, దుండిగల్ కొంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్లు, కూరగాయలు విక్రయించే వారితో పాటు తదితరులను వీధి వ్యాపారులుగా గుర్తించారు.



వివరాలను బ్యాంక్ అధికారికి అందజేస్తున్న మెప్మా సిబ్బంది

◆ నిజాంపేట కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల్లో మొదటి దశలో 6,007 మందిని గుర్తించిన మండల రిసోర్స్ పర్సన్స్ వారిలో 4,803 మొదటి దఫా రూ.10వేలు వారికి ఆర్థిక సహాయం కింద అందజేశారు.

క్రమంగా పెరుగుతున్న సహాయం..

మొదటి విడతలో రూ.10వేలను వారి అకౌంట్లలో జమ చేయగా సకాలంలో తిరిగి రుణాలు చెల్లించిన రెండో దఫా రూ.20వేలు, మూడో దఫా రూ.50వేలను వారి ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుతం మూడో దఫా కొనసాగుతోంది. మూడో దఫా సక్రమంగా చెల్లిస్తే త్వరలోనే రూ.లక్ష వారికి ఆర్థిక సహాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి.

బ్యాంకుల నిర్లక్ష్యంతో తగ్గుతున్న లబ్ధిదారులు..

కుత్బుల్లాపూర్‌లోని మూడు మున్సిపాలిటీలకు సంబంధించిన లబ్ధిదారులు దూలపల్లి, గండిమైసమ్మ, దుండిగల్ ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతాల్లో తెరిచారు. కాగా దుండిగల్‌లోని ఎస్‌బీఐ సిబ్బంది వీధి వ్యాపారుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తుండటంతో లబ్ధిదారులు తిరిగి రుణాలు తీసుకునేందుకు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు చిన్న చిన్న కారణాలను చూపుతూ ఏకంగా 200కు పైగా లబ్ధిదారులకు రుణాలను అందించకుండా వేధిస్తున్నారని.. సాధారణమైన జీవితం గడిపే వీధి వ్యాపారుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారని.. తక్షణమే వారికి బ్యాంక్ మేనేజర్ రుణాలు మంజూరు చేయించాలని కోరుతున్నారు.

మొదటి విడతలో ఇలా..

ప్రాంతం	గుర్తింపుపొందిన వ్యాపారులు	సరైన పత్రాలు ఇచ్చిన వారు	లబ్ధిపొందిన వారు	జమైన మొత్తం
నిజాంపేట	2,539	2,030	1,562	రూ.1.56కోట్లు
దుండిగల్	2,219	1,774	1,438	రూ.1.43కోట్లు
కొంపల్లి	1,249	999	916	రూ.91లక్షలు

రెండో విడతలో ఇలా..

నిజాంపేట	2,030	991	715	రూ.1.43కోట్లు
దుండిగల్	1,774	866	580	రూ.1.16కోట్లు
కొంపల్లి	999	488	449	రూ.89లక్షలు

మూడో విడతలో ఇలా..

నిజాంపేట	991	252	101	రూ.50లక్షలు
దుండిగల్	866	220	49	రూ.24లక్షలు
కొంపల్లి	488	124	11	రూ.5.5లక్షలు

సద్వినియోగం చేసుకోవాలి..



వీధి వ్యాపారులు ప్రధాని ఆత్మ నిర్భర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలి. వచ్చేసారి రూ.లక్ష రుణం వారికి అందజేస్తాం. పెట్టుబడి పెట్టలేని వారికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. వీధి వ్యాపారాలు ఆర్థికంగా స్థిరపడాలి.

– కె.సత్యనారాయణ రావు, దుండిగల్ కమిషనర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జోనల్ కమిషనర్ మమత



కుత్బుల్లాపూర్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత అన్నారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల ప్రగతినగర్‌లో మ్యాన్‌హోల్ మూతను తెరవడంతో ఓ బాలుడి అందులో పడి మృత్యువాత పడ్డాడని, ఈ ఘటన బాలుడి కుటుంబానికి తీవ్ర శోకం మిగిల్చిందన్నారు. ఎక్కడైనా మూతలు తెరిచిన మ్యాన్‌హోళ్లు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

◆ మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు నిర్వహించే సిబ్బంది పనులు పూర్తయిన వెంటనే మూతలను ఏర్పాటు చేయాలని సూచించారు. మ్యాన్‌హోల్ మూతలను ఇష్టానుసారంగా తెరవద్దని, ఆయా ప్రాంతాల్లో మాన్‌సూన్ సిబ్బంది వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. వరద ఉధృతి తీవ్రంగా ఉండే ప్రాంత వాసులు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

◆ మ్యాన్‌హోల్ మూతలపై గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డి (6309529286), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోవర్ధన్‌గౌడ్ (9154299633), కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్ నాగమణి (7799910437), ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణచైతన్య (99701908887) నెంబర్లలో సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని జోన్ కమిషనర్ మమత తెలిపారు.

నేడు ప్రత్యేక పూజలు

సుభాష్‌నగర్: శ్రావణ మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని గాజులరామారం మెట్‌కానిగూడలోని శ్రీనల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అముర ఇంద్రసేన గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి అభిషేకాలు ఉంటాయని, సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు కోరారు.

కొత్త ఓటరు నమోదులో నిర్లక్ష్యం చేయొద్దు

- ఎన్నికల అధికారి పులి సైదులు

కుత్బుల్లాపూర్: కొత్త ఓటరు నమోదులో సూపర్‌వైజర్లు నిర్లక్ష్యం చేయరాదని.. బీఎల్‌ఓల సహకారంతో దరఖాస్తు ఫారాలు 6, 7, 8ల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు అన్నారు. శుక్రవారం ఉదయం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ నాగమణి అధ్యక్షతన సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించగా సైదులు వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం సూరారంలో ట్రాన్స్‌జెండర్స్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారిలో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని సూచించిన ఆయన వాటి విధివిధానాలను వివరించారు. గాజులరామారం సర్కిల్ బూత్ లెవెల్ సిబ్బందితో భగత్ సింగ్‌నగర్ వార్డు కార్యాలయంలో ఉపకమిషనర్ మల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇటీవల రెండు విడతల్లో చేపట్టిన దరఖాస్తుల స్వీకరణలో వచ్చిన వాటిని పరిశీలించాలన్నారు. ఇంటింటికీ తిరిగి ఓటు హక్కు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని పులి సైదులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునే సమస్య లేదని వారిపై వేటు తప్పదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించి వారిని ఓటు వేసే విధంగా అవగాహన కల్పిస్తూ ముందుకు సాగాలని, ఎన్నికల విధుల్లో ఉండే ప్రతి అధికారికి బాధ్యత ఉంటుందని స్పష్టం చేశారు.



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమావేశమైన ఎన్నికల అధికారి పులి సైదులు

ఓటరు నమోదుపై అవగాహన

దుండిగల్: ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని.. ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ మంజుల అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే ఓటర్ల జాబితాలో తప్పుగా ఉన్న పేర్లు, చిరునామాలను సైతం మార్చుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ శాంత, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామ్‌రాజ్ కాటన్ షోరూమ్ ప్రారంభం



ప్రగతినగర్‌లో రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో వస్త్రాలను అందించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను ఎమ్మెల్యే మేయర్ నీలారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఏ ఇబ్బందులు ఎదురైనా వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేస్తానని.. ప్రతి చిన్న విషయాన్ని పరిష్కరించకుండా అధికారులు ప్రజలను కార్యాలయాలు చుట్టు తిప్పుకుంటే మాత్రం ఊరుకునే సమస్య లేదని ఎమ్మెల్సీ, శాసన మండలి విప్ శంభీపూర్‌రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు శుక్రవారం పార్టీ కార్యాలయానికి వచ్చి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా అధికారులకు ఫోన్లలో మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. చిన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రతి పనికి కార్యాలయం చుట్టూ ప్రజలను తిప్పకుండా చూడాలని సూచించారు.. నియోజకవర్గం అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అనేక మౌలిక వసతులు కల్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు.



సమస్యలను వింటున్న ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు

పోలీసుల అదుపులో వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి

కుత్బుల్లాపూర్: 'నా తండ్రి పేరు మీద కాలనీ ఉంది.. నిర్మాణం చేపట్టాలంటే డబ్బులు ఇవ్వాలి'అని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని పేట్‌బషీరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై ధర్మేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్ సర్వే నం.25/1లో ప్రభుత్వం గతంలో పట్టాలు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఉప్పరిరాజు అనే వ్యక్తి స్థలం కొనుగోలు చేసి అక్కడ నిర్మాణం చేపడుతున్నాడు. స్థానికంగా ఉండే సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి ఇక్కడ నిర్మాణం చేపడితే తనకు డబ్బులు ఇవ్వాలని వసూళ్లకు పాల్పడుతూ వస్తున్నాడు. తన తండ్రి పేరు మీద కాలనీ ఉంది.. కాబట్టి డబ్బులు ఇవ్వాల్సిందే అంటూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు రాగా దర్యాప్తు చేసి శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే



పురపాలక శాఖమంత్రి కేటీఆర్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన పురపాలక శాఖామంత్రి కేటీఆర్‌ను శుక్రవారం సచివాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలకుండిని అందజేసి రాష్ట్రానికి వేలాది కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చేందుకు కృషి చేసినందుకు అభినందనలు తెలియజేశారు. అదే విధంగా తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

◆ కుత్బుల్లాపూర్ డివిజన్ సంజీవయ్యనగర్‌లోని శ్రీనల్లపోచమ్మ ఆలయ 6వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేశ్ యాదవ్, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ యాదగిరి, విజయ్‌గుప్తా, ఉమేష్, నగేష్, దుర్గపాతి, కోటస్వామి, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వృద్ధుల అదృశ్యం



దుండిగల్: మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ గ్రామానికి చెందిన అల్లి కృష్ణవేణి(67)కి మతిస్థిమితం సరిగ్గా లేదు. కాగా ఆగస్టు 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన కృష్ణవేణి తిరిగి రాలేదు. ఎంత వెతికినీ ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలోనూ ఇదే మాదిరిగా 15సార్లు ఇంటి నుంచి వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. నెలైనా ఇప్పటి వరకు ఆమె తిరిగి రాలేదని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రాంతంలో..



కుత్బుల్లాపూర్: మతిస్థిమితం సరిగా లేని వృద్ధురాలు అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి వెంకటేశ్వర కాలనీలో నివాసముండే అచ్చమ్మ ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో ఇంట్లో చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. రాత్రైనా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు శుక్రవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అచ్చమ్మకు మతిస్థిమితం సరిగా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'రేవంత్‌రెడ్డి సీఎం అయినట్లు ఊహల్లో తేలియాడుతున్నారు'

వైఎస్సార్‌టీపీ కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ సురేష్‌రెడ్డి

చింతల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తాను అప్పుడే ముఖ్యమంత్రి అయినట్లు ఊహలలో తేలియాడుతున్నారని వైఎస్సార్‌టీపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌తో సమానంగా తాను కూడా కాంగ్రెస్‌ని లీడ్ చేస్తున్నా అని తనకు తానే పొగుడుకోవటం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒకప్పుడు టీడీపీలో ఉన్నప్పుడు వైఎస్ మరణంపైన రేవంత్ చేసిన వ్యాఖ్యలు వైఎస్సార్ అభిమానులు ఇంకా మరచిపోలేదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పోల్చుకున్న మీరు ఆయన బిడ్డ షర్మిల కాంగ్రెస్‌లోకి వస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. వైఎస్సార్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను నెరవేర్చుతా అని బహిరంగ ప్రకటన చేయాలని.. అప్పుడు ఆయన టీడీపీ మనిషి కాదని తెలంగాణ ప్రజలు నమ్ముతారన్నారు అన్నారు. డబ్బా కొట్టుకోవడం మాని అందరిని కలుపుకుపోయే విషయంపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. వైఎస్సార్‌టీపీ ఇంకా కాంగ్రెస్‌లో విలీనం కాలేదని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకోవడమా.. విలీనమా.., లేక ఒంటరి పోరునా అనేది తొందరలోనే తెలుస్తుందన్నారు. వైఎస్సార్‌టీపీ నాయకులు, కార్యకర్తలు దేనికైనా సిద్ధంగా ఉండాలని కోరారు.

విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులు కావాలి

చింతల్: విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని బీజేపీ నాయకుడు, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ ఆదేశాల మేరకు కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శుక్రవారం సూరారంకాలనీలోని జిల్లా పరిషత్ హైస్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 1200 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందిశ్రీరాములు, అంగడి మల్లేష్, దేవర రమేష్, పోల్కం విగ్నేష్, వెంకట రత్నం, విజేందర్ రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ,అనుక్, మారె గణేష్, గుబ్బల వెంకటరమణ, శ్రీనివాస్ గౌడ్ చక్రవర్తి, మహేష్ పటేల్, హరివర్ధన్ ముదిరాజ్, విజయ్ కుమార్, కేకేఎం ట్రస్ట్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్

పారిశ్రామిక రంగాభివృద్ధికి 'బీఓఐ'ది ఎనలేని కృషి

రంగారెడ్డినగర్: సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు రుణాలు ఇస్తూ పారిశ్రామిక రంగాభివృద్ధికి బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) ఎనలేని కృషి చేస్తోందని మాసన టూల్‌టెక్ అధినేత వాకిటి రామ్‌రెడ్డి అన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా 118వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం బాలానగర్‌లోని బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు అరుణ్‌కుమార్, మునిరాబేగం లతో కలిసి రామ్‌రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పరిశ్రమల నిర్వాహకులకు సకాలంలో రుణాలు అందిస్తూ వాటి పురోగాభివృద్ధికి కృషి చేస్తున్నారని పలువురు పారిశ్రామికవేత్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అరుణ్‌కుమార్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సునిత, ఉదయ్ కౌశిక్, కల్పన, శృతి, సుబాష్, రమాదేవి, కార్తిక్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



బీఓఐ అధికారులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పారిశ్రామికవేత్త వాకిటి రామ్‌రెడ్డి